క్లుప్తంగా

ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో కోర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండపల్లి సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా అనిశెట్టి సదాశివ్, కోశాధికారిగా మహాత్మ భీంరావ్, ప్రచార కార్యదర్శిగా విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా రాజ్‌కుమార్, సలహాదారులుగా సహారె రాజు, వెంకటేశ్వర్లు, సురేశ్, రమేశ్‌లను ఎన్నుకున్నారు.

9న వాలీబాల్ టోర్నమెంట్

బెజ్జూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు మండల లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై సర్తాజ్ పాషా తెలిపారు. బెజ్జూర్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగల యువకులు పోలీస్‌స్టేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



వర్షానికి కూలిన ఇంటి గోడ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన తెలిగే పుల్లయ్య ఇంటి గోడ శనివారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గోడ కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గోడ కూలిన ప్రదేశాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

చెట్లతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న అధ్యక్షుడు ఓంప్రకాశ్

బెజ్జూర్: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని సహకార సంఘం అధ్యక్షుడు కుర్సింగ ఓంప్రకాశ్ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా ఏక్ పేడ్ మాకే నామ్ అనే నినాదంతో బెజ్జూర్ సహకార సంఘం ఆవరణలో ఆదివారం మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ వట్టేపల్లి మునీశ్వరి, డైరెక్టర్ శ్రీవర్ధన్, కార్యదర్శి జక్కుల సత్యనారాయణ గౌడ్, మాజీ సర్పంచ్ కొండ్ర జగ్గా గౌడ్, బూస శంకర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి సమీపంలో ఆదివారం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. చింతలమానెపల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరి మార్గంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ సీజన్ నేపథ్యంలో గ్లైసిల్ విత్తనాలు, గ్లైఫొసెట్ గడ్డిమందు మహారాష్ట్ర నుంచి రాకుండా నిరోధించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వాహనాల సంబంధిత పత్రాలు, వాహనాలలో తరలిస్తున్న సరుకులను తనిఖీ చేశారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

బెజ్జూర్: బెజ్జూర్ నూతన ఎస్సైగా సర్తాజ్ పాషా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివారం మాలి సంఘం నాయకులతో పాటు కోనేరు కోనప్ప అభిమానులు వేర్వేరుగా కలిసి శాలువాలతో సన్మానించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటు పడాలని సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్య అన్నారు. తొలి ఏకాదశి, మొహర్రం పండుగ సందర్భంగా ఆదివారం కుప్టి(కె) గ్రామంలో గల కేసీఆర్ పార్కులో గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతిఒక్కరూ తమవంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. చెట్లతోనే వాతావరణం సమతూల్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

ఇంటింటా గోరింట శోభ!



గోరింటాకు వేడుకల్లో మహిళలు



గోరింటాకు తెంపుతున్న మహిళలు

- ఆషాఢంలో మహిళల సంబురాలు
- చర్మవ్యాధుల నుంచి రక్షణ
- గిరి గ్రామాల్లోనూ సందడి



కెరమెరి: సౌందర్య సాధనకు గోరింటాకు మహిళలకు ప్రకృతి ప్రసాదించిన వరం. వర్ష రుతువులో వచ్చే ఆషాఢమాసంలో చేతులకు గోరింటాకు పెట్టుకోవడం పూర్వకాలం నుంచి తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయంగా వస్తోంది. ఆషాఢమాసం ఈ ఏడాది జూన్ 26న ప్రారంభమై జూలై 24 వరకు ఉంటుంది. దీంతో ప్రతి ఇంటా గోరింట శోభ సంతరించుకుంది. పెట్టుకున్న గోరింటాకు ఎంత బాగా పండితే వారి జీవితం అంత సుఖమయంగా ఉంటుందని మహిళల నమ్మకం. గోరింటాకు ఔషధ గు ణాలు కలిగి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

ఎన్నో శాస్త్రీయ ప్రయోజనాలు..

గోరింటాకు పెట్టుకోవడం వెనుక శాస్త్రీయ కోణం ఉంది. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చనే అభిప్రాయం ఉంది. గోరింటాకు బాగా పండితే మంచి భర్త దొరుకుతాడని, అదే వివాహితులైతే వారి కడుపు పండుతుందని, కాపురం చక్కగా ఉంటుందని పెద్దవాళ్లు చెబుతుంటారు. ఈ నమ్మకాలు ఎలా ఉన్నా గోరింటాకుని శుభానికి చిహ్నంగా భావిస్తారు. గిరిజన మండలాలు కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్‌లోని గిరి పల్లెల్లోనూ ఆదివారం మహిళలు సామూహికంగా ఒక చోట చేరి తమ చేతులపై గోరింటాకు వేసుకున్నారు. సాంప్రదాయ పద్ధతిలో రోలులో గోరింటాకు నూరి అంతా ఒకచోట చేరి పాటలు పాడుతూ ఒకరికొకరు పెట్టుకుంటున్నారు.

ఔషధ గుణాలు..

గోరింటాకు శుభాకార్యాలు, పండుగల వేళ పెట్టుకోవడం ఆనవాయితీ. గోరింటాకుతో ఆరోగ్యం సిద్ధిస్తుందని నమ్ముతారు. ఆయుర్వేదంలో గోరింటాకు వేర్లు, బెరడు, ఆకులు, పూలు, విత్తనాలు అన్ని ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని చెబుతున్నారు. ఆషాఢమాసంలో నీటిలో మార్పులు వస్తాయి. మహిళలు ఎక్కువగా నీటితో పని చేయడం వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశం ఎక్కువ. గోరింటాకు పెట్టుకోవడం వల్ల మహిళలు వ్యాధులు బారిన పడకుండా ఉంటారని ఆయుర్వేదం చెబుతోంది.

సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది



చేతులకు పెట్టుకునే గోరింటాకు సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. వేళ్లకు గోరింటాకు పెట్టుకోవడం వల్ల చర్మ వ్యాధులు రాకుండా ఉంటాయి. గోళ్లకు సైతం అందం, బలాన్ని కలిగిస్తుంది.

– బంటు ఫడ్, కెరమెరి

ఆరోగ్యానికి మేలు



గోరింటాకు పెట్టుకోవడంతో అంటు రోగాలు దరికి చేరవు. గోరింటాకు శరీరాన్ని చల్లబరుస్తుంది. జ్వరం, తలనొప్పిని తగ్గిస్తుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

– ఎలుగు అశ్విని, కెరమెరి

చిన్నప్పటి నుంచి..



ఆషాఢం అంటేనే గోరింటాకు గుర్తుకు వస్తుంది. చిన్నప్పటి నుంచి గోరింటాకు పెట్టుకుంటున్న. ఇటీవల కాలంలో మహిళలు అంతా కలిసి వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉంది.

– పల్లెర్ల శ్రీవాణి, కెరమెరి

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



ఆలయంలో మంగళహారతులిస్తున్న మహిళలు

కెరమెరి: తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని శివాలయంలో మహిళలు, పురుషులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. ఏడాదిలో వచ్చే ప్రథమ పండుగగా తొలిఏకాదశిని జరుపుకున్నారు. శ్రీరాముని ఆలయాన్ని దర్శించుకుని శ్రీరామ, లక్ష్మణ, సీత, దుర్గాదేవికి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



లింగాపూర్: సిర్పూర్ (యూ) మండలం సోయంగూడలో వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంతో పాటు నీంగూడ, అంబారావు, రింగన్‌ఘాట్ తదితర గ్రామాల్లో మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని పీర్ల పండుగను ఘనంగా జరుకున్నారు. 9 రోజుల పాటు ఉత్సవాన్ని ఆయా గ్రామాల్లో జరుపుకున్నారు. పీరీలను ఊరేగించారు.

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలంలోని సోయంగూడ గ్రామంలో మొహర్రం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. లింగాపూర్, సిర్పూర్(యూ) మండలాల్లోని ప్రధాన వీధుల్లో పీరీలను ఊరేగించారు.

కాగజ్‌నగర్‌టౌన్: త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగ కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మలీద ముద్దలు, షర్బత్, ప్రత్యేక వంటకాలను నైవేద్యంగా చూపించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీరీలు పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి రాత్రి వరకు మార్కెట్‌లో పాటలు పాడుతూ నృత్యం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



రెబ్బెనలో..

ఆసిఫాబాద్‌అర్బన్: త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలో పీర్ల బంగ్లాల వద్ద పీరీలకు మలిద ముద్దలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

రెబ్బెన: మొహరం వేడుకలు ఆదివారం ముగిశాయి. మొహరం సందర్భంగా గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం పీరీలను గ్రామాల్లో ఊరేగిస్తూ సమీప వాగులకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గోలేటి, పుంజుమేరగూడ, నంబాల, ఇందిరానగర్, నారాయపూర్, తక్కళ్లపల్లి గ్రామాల్లో ప్రతిష్ఠించిన పీరీలను గ్రామాలకు సమీపాన ఉన్న వాగుల్లో నిమజ్జనం చేశారు.



కెరమెరి: నీంగూడలో..



కాగజ్‌నగర్ పట్టణంలో..

ఘనంగా బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి



కెరమెరి: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలో..

కెరమెరి: మండల కేంద్రంలో ఆదివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రాం దేశానికి ఎంతో చేశారన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం అలుపెరిగిన పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొర్ల వెంకటేశ్, నాయకులు గోగర్ల రాజయ్య, అశోక్, వెంకట్, శంకర్, స్వామి, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో జగ్జీవన్ రాం చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కేశవ్‌రావ్ మాట్లాడుతూ జగ్జీవన్‌రాం ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాటూరి జయరాజ్, గుండా థామస్, పోల్కర్ రామచంద్ర, ఏముర్ల పోశం, రేగుంట మహేశ్, భీంరావు, దూడల అశోక్, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.



కౌటాల: నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: దళితుల ఆశాజీవి బాబు జగ్జీవన్ రాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా నాయకులు గొడిసెల రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని తలోడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాబు జగ్గీవన్ రాం వర్ధంతి నిర్వహించారు. సిద్దల వెంకటేశ్, గోగర్ల ప్రవీణ్‌కుమార్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్లు!

- అధ్వానంగా కౌటాల–తుమ్మిడిహెట్టి రోడ్డు
- గతేడాది తారురోడ్డుపై మట్టి పనులు
- వానలకు బురదమయంగా రోడ్డు



కౌటాలలో బురదమయంగా రోడ్డు



గుంతలమయంగా కౌటాల -తుమ్మిడిహెట్టి రోడ్డు

కౌటాల: మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్, తాటిపల్లి, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట, తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన తారురోడ్డుపై గుంతలు పడడంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడతో బస్సులు, ఆటోల్లో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కౌటాల నుంచి మొగడ్‌దగడ్, బాలేపల్లి గ్రామాల సమీపంలోని రోడ్డుపై అధికంగా గుంతలు పడి పూర్తిగా చెడిపోయింది. దీంతో తుమ్మిడిహెట్టి, గుండాయిపేట ప్రజలు వేరే మార్గంలో గుడ్లబోరి మీదుగా అదనంగా 5 కిలోమీటర్ల దూరభారంతో కౌటాలకు చేరుకుంటున్నారు. గత నెల 25న కౌటాలకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై మొగడ్‌దగడ్ సమీపంలోని రోడ్డుపై గుంతను తప్పించబోయి అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలపాలయ్యారు.

ఏటా ఇబ్బందులు

మండల కేంద్రం నుంచి మొగడ్‌దగడ్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద రోడ్డుపై గుంత పడింది. కల్వర్టు సైతం కోతకు గురైంది. దీంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. కల్వర్టు కోతకు గురై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

బురదమయంగా..

కౌటాల– తుమ్మిడిహెట్టి తారురోడ్డుపై గుంతలు పడడంతో గతేడాది బీటీ రోడ్లపై మరమ్మతుల పేరిట ఈరోడ్డుపై గుత్తేదారులు మట్టి వేయగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తారురోడ్డు బురదమయంగా మారింది. కౌటాల – తుమ్మిడిహెట్టి వరకు 12 కిలోమీటర్ల రోడ్డుకు మరమ్మతుల కోసం ఎన్డీఎఫ్ నిధులు సుమారు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ తారురోడ్డుపై మరమ్మతులకు కంకర చిప్స్ వేయాల్సి ఉండగా.. గుత్తేదారు నిబంధనలు తుంగలో తొక్కి తారురోడ్డుపై నాసిరకమైన మట్టి పోశారు. దీంతో వర్షాలకు మట్టి కొట్టుకుపోగా గుంతలు బురదమయంగా మారి కష్టాలు రెండింతలయ్యాయని వాహనదారులు వాపోతున్నారు.

ఐదేళ్లయినా మరమ్మతులు కరువు



దహెగాం: మండలంలోని కర్జి గ్రామ సమీపంలో ఉన్న చెరువు మత్తడి తెగి ఐదేళ్లయినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. 2020 -21 సంవత్సరంలో భారీ వర్షాలు కురువడంతో చెరువులోకి భారీగా వరద నీరు చేరి మత్తడి ధ్వంసమైంది. అప్పటి నుంచి చెరువులోకి వచ్చిన వరద నీరంతా వృథాగా పోతుందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మత్తడికి బుంగ పడ్డ సమయంలో రైతులే మరమ్మతులు చేశారు. భారీ వరదల వల్ల మత్తడి పూర్తిగా కొట్టుకుపోవడంతో నీరు వృథాగా పోతుంది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మత్తడి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సహజం

నార్నూర్: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గాదిగూడ మండలంలోని ఐటీడీఏ పరిధిలో శాటిలైట్ సెంటర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ నారాయణ్ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఆదివారం నాగల్‌కొండ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్, న్యాయవాది బానోత్ జగన్, మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ ఎంపీటీసీ ఉత్తం, జాదవ్ గుణవంతరావు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి

ఆదిలాబాద్‌టౌన్: పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గోపికిషన్ అన్నారు. జునోసిస్‌డే సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పశువైద్య శాలలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్త లూయిపాశ్చర్ మొదటిసారిగా యుక్త వయస్సులో ఉన్న బాలుడికి యాంటీ రెబిస్ టీకా వేశారని తెలిపారు. పెంపుడు జంతువుల నుంచి మానవాళికి వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయడం జరుగుతుందన్నారు. పెంపుడు శునకాలకు రెబిస్ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు దూద్‌రాం రాథోడ్, గజానంద్, రజినికాంత్, పద్మ, ఖాజాపాషా, అమీన్, రమేశ్, సాజిద్, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు సంజన, శిరీష, శ్రీజ బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉద్యోగులు విద్యార్థులను ఆదివారం శాలువాతో సత్కరించారు. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉద్యోగులు వికేష్ కుమార్, చంద్రకాంత్, సుభాష్, సాయి చరణ్, రవికాంత్, నరేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.